మాచిరాజు కామేశ్వరరావు

# అవకాశం



**"వెళ్ళగానే** ఉత్తరం రాయి, అక్కా!" అన్నాడు హర్ష కళ్ళు చెమ్మగిల్లుతుండగా.

కంపార్ట్‌మెంట్ గుమ్మం దగ్గర నిలబడ్డ సుజాత కళ్ళలో తడి!

ఏ జన్మలో అనుబంధమో ఇది!

హర్ష ఎవరు, తను ఎవరు?

హర్ష ఇంటర్‌లో తన మూడో తమ్ముడి క్లాస్‌మేట్! వాళ్ళిద్దరూ పరీక్షల టైమ్‌లో కంబైండ్ స్టడీ చేసేవారు. తను వాళ్ళకి అర్ధరాత్రి లేచి టీ కలిపి ఇస్తూ ఉండేది. రాజుతోపాటు హర్ష కూడా తనని 'అక్కా' అనే పిలిచేవాడు. ఇంటర్ అవగానే ఎయిర్‌మన్‌గా వెళ్ళిపోయాడు రాజు! హర్ష మాత్రం పాత పరిచయం కొద్దీ తరుచు వస్తూ ఉండేవాడు. తన సొంత తమ్ముళ్ళ కన్నా హర్షకే తన మీద ప్రేమ ఎక్కువ.

తను నల్లగా ఉంటుంది. ఆ నలుపే తన జీవితానికి–

శాపం అయింది. తన పెళ్ళి చేయలేక బెంగతో తండ్రి పోయాడు. తను హాస్టల్‌లో ఉద్యోగం రావడంతో హైదరాబాద్ వచ్చేసింది.

రైలు కూతతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది సుజాత.

రైలు మెల్లమెల్లగా వేగం పుంజుకుంటోంది. చేయి వూపుతున్న హర్ష క్రమంగా కనుమరుగు అయ్యాడు.

సుజాత నిట్టూర్చింది. ముగ్గురు తమ్ముళ్ళూ ''అక్కకింక పెళ్ళి కాదు'' అని తీర్మానం చేసుకుని పెళ్ళిళ్ళు చేసేసుకున్నారు. హర్షమాత్రం ''నీ పెళ్ళి కానిదే నేను చేసుకోను, అక్కా!' అంటూ ఉత్తరాలు రాసేవాడు.

''నా పెళ్ళితో నీకేం పని? జీవితంలో అనుకున్నవి అన్నీ సమకూరడం ఎక్కడో అదృష్టవంతులకే తెలుసా? అసలు నేను పెళ్ళి చేసుకోవాలనే అనుకోవడం లేదు. అమ్మతోపాటు ఇలా బతికేస్తాను. నువ్వు చేసుకోక పోతే నా మీద ఒట్టే!'' అని మందలిస్తూ రాసేది సుజాత.

అక్కకోసం వద్దనుకున్నా సొంత చెల్లెలికోసం పెళ్ళి చేసుకోక తప్పలేదు హర్షకి!

హర్ష కట్నం డబ్బు చెల్లెలి పెళ్ళికి మదుపు!

హర్షది నెల్లూరు దగ్గర ఉన్న రేబాల! పెళ్ళి అయి ఇరవై నాలుగు గంటలు కాకపోయినా అతను స్వయంగా సుజాతని రైలు ఎక్కించడానికి నెల్లూరు వచ్చాడు. ఆ రోజు హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు లేటు.

సుజాత గుమ్మం దగ్గర్నుంచి కదిలి లోపలికి వచ్చేసరికి అంతా మంచి నిద్రలో ఉన్నారు.

సుజాత తన బెర్త్ వెదుక్కుంటూ వచ్చింది.

ఆ బెర్త్ మీద ఒక పాప, బాబుతో ఒక నలభై ఏళ్ళ అతను ఉన్నాడు.

సుజాత ఆ బెర్త్ నంబర్ చూసుకోవడం గమనించి కిటికీ దగ్గర ఉన్న అతను లేచి ''ఇలా కూర్చోండి!'' అన్నాడు, తను గాఢ నిద్రలో ఉన్న పిల్లల కాళ్ళవైపు కూర్చుంటూ.

సుజాత సూట్‌కేస్ బెర్త్ కిందికి జరుపుకుని, కిటికీ పక్కన కూర్చుంది.

కిటికీ లోంచి చల్లని గాలి రివ్వున వీస్తోంది.

'వర్షం వచ్చేలా ఉంది. హర్ష వర్షంలో చిక్కుపడి పోతాడేమో!' అనుకుంది సుజాత. వెంటనే అతను నెల్లూరు ఫ్రెండ్ మూర్తి ఇంట్లో పడుకుంటానని అన్న విషయం గుర్తుకు వచ్చి మనసు తేలిక పడింది.

కిటికీలోంచి చీకట్లోకి చూడలేక, తల తిప్పి కంపార్ట్‌మెంట్ అంతా కలియ జూసింది సుజాత. ఎదురుగా ఉన్న లోయర్, మిడిల్ బెర్త్‌ల మీద ఎవరో ముసలి దంపతులు కాబోలు గాఢనిద్రలో ఉన్నారు.

పెళ్ళి బడలిక — అందులోనూ అర్ధరాత్రి ముహూర్తం కావడంతో సుజాతకి కూడా నిద్ర వస్తోన్నట్లుగా ఉంది.

''ఎక్స్‌క్యూజ్ మీ! మీది లోయర్ బెర్తా? మిడిల్ బెర్తా?'' అని అడిగింది ఏదో ఆలోచనలో ఉన్న అతడిని!

అతను ఉలిక్కిపడి ఇటు చూశాడు.

''సారీ! నాకు అలాట్ చేసిన బెర్త్ ఏదో నాకే తెలీదు. ముప్ఫై రూపాయలు టి. సి. చేతిలో పోస్తే పిల్లల మొహం చూసి ఎలా చేస్తున్నాను అంటూ ఈ చోటు చూపించాడు. మీకు ఏది కన్వీనియంట్ అనుకుంటే అక్కడ పడుకోండి!'' అంటూ లేవబోయాడతను.

అతన్ని కూర్చోమన్నట్లుగా చేయి వూపి ''కాస్సేపు కూర్చుంటా లెండి'' అంది సుజాత.

సన్నగా ప్రారంభమైన వర్షం చినుకులు కిటికీ లోంచి మీద పడుతుంటే పైన పన్నీరు చిలకరిస్తున్నట్లుగా ఉంది ఆమెకి! చిన్నప్పట్నించీ సుజాతకి వర్షం అంటే చాలా ఇష్టం. ఇంటిల్లిపాదీ తలుపులన్నీ బిడాయించుకుని వెచ్చగా కూర్చున్నా, ఆమెమాత్రం కిటికీలో కూర్చుని ధారలుగా కురుస్తున్న వర్షాన్ని, గాలికి వూగుతున్న చెట్లను చూస్తూ గంటలు గంటలు గడిపేసేది.

కంపార్ట్‌మెంట్ అంతా నీలపు కాంతి పరుచుకుని ఉంది. వాళ్ళిద్దరూ తప్ప అంతా మంచి నిద్రలో ఉన్నారు.

''మీరు హైదరాబాద్ దాకానా?'' అతనే పలకరించాడు.

''సికింద్రాబాద్! మీరు?'' మర్యాదకి అడిగినట్లుగా అడిగింది సుజాత.

''హైదరాబాద్ వెళ్తున్నాను. ఈ పిల్లలతో ప్రయాణం!'' నిట్టూర్చాడతను.

''వీళ్ళ అమ్మగారు వచ్చి ఉంటే మీకు ప్రాబ్లెమ్ ఉండేది కాదేమో!' ఏదో మాట్లాడా లన్నట్లుగా క్యాజువల్‌గా అంది సుజాత.

''మా కంత అదృష్టం కూడానా! వీళ్ళ అమ్మ ... లేదు! ! ఎటో శూన్యంలోకి చూస్తూ బరువుగా అన్నాడతను.

''అయ్యో! అయామ్ సారీ!'' నొచ్చుకుంది సుజాత.

వాళ్ళు తల్లిలేని పిల్లలనగానే ఆమె గుండె పీకయి పోయింది. తల్లి పోవడం అంత దురదృష్టం మరొకటి లేదని ఆమె ఉద్దేశం. తండ్రి లేకపోయినా పిల్లలు బ్రతక గలరేమో గానీ, తల్లి లేని పిల్లల బ్రతుకు దుర్భరం.

ఆమె జాలిగా ఆ పిల్లలకేసి చూసింది.

బాబుకి మూడేళ్ళు మించి ఉండవు. ఉంగరాల జుట్టుతో మిసమిసలాడుతూ ముద్దొస్తున్నాడు. పాపకి అయిదారేళ్ళు ఉంటాయి. బాబుకన్నా ఒక ఛాయ తక్కువైనా కళకళలాడుతోంది మొహం!

''ఎల్లుండి మా తమ్ముడి పెళ్ళి. అందుకే ఈ ప్రయాణం! నిజానికి నా భార్య పోయాక నేను ఈ రెండేళ్ళుగా ఏ శుభ కార్యానికీ ఎటెండ్ కాలేదు. ఇది తప్పనిసరి అయింది!'' విషాదంగా ఉంది ఆ గొంతు.

సుజాత క్రీగంట అతడికేసి చూసింది. ఎత్తయిన విగ్రహం! నల్లటి దట్టమైన జుట్టు! పిల్లలకి ఆయన రంగే వచ్చినట్లుంది. తను పెద్దగా గమనించ లేదు కానీ, మనిషి అందమైన వాడే!

ఉన్నట్లుండి వర్షం పుంజుకుంది. జల్లు వేగంగా కిటికీ లోంచి లోపలికి వస్తూండటంతో కంగారుపడి అద్దం దింపేయబోయింది సుజాత.

బిగుసుకు పోయి ఉన్న ఆ అద్దం ఆమెకి లొంగ లేదు.

'మీరు ఉండండి! నేను చూస్తాను.' అతను దగ్గిరగా వచ్చి వంగి గ్లాస్ కిందకి దించాడు.

అతను దగ్గిరికి రాగానే ఏదో పేరు తెలియని సన్నని పరిమళం చుట్టుముట్టింది సుజాతని. పచ్చని చెంపల మీద గడ్డం గీసినంత మేరా ఆకుపచ్చగా—క్షణం చలించింది సుజాత. పరాయి మగవాణ్ణి అంత దగ్గిరగా చూడటం అదే మొదటి సారి ఆమెకి!

''టైమ్ పన్నెండు దాటుతోంది. మిమ్మల్ని ఇంకా కూర్చోబెట్టడం మర్యాద కాదు. మీరు లోయర్ బెర్త్ మీద పడుకోండి. మేం మిడిల్ బెర్త్ మీద పడుకుంటాం!' అన్నాడు అతను.

''మీరు ముగ్గురూ ఒక బెర్త్ మీద ఎలా పడుకుంటారు? బాబుని నా పక్కన ఉండనీయండి'' అంది సుజాత.



అతను మొహమాట పడ్డాడు. ''మీకు ఇబ్బంది!

''ఫర్వాలేదు. మన రైల్వేవాళ్ళ బెర్తుల మీద ఒకళ్ళు పడుకోవడమే కష్టం! మీరు మొహమాట పడితే తెల్లవార్లూ మీకు జాగరణే అవుతుంది'' అంది సుజాత నవ్వుతూ!

''వసంత ఉన్నప్పుడు ఈ సమస్యే తెలిసేది కాదు. ఇద్దరం చెరొకళ్ళనీ వేసుకుని చెరో బెర్త్ మీదా పడుకునే వాళ్ళం. ఆమె పోయాక ఇదే నా మొదటి ప్రయాణం. మా తమ్ముళ్ళు మళ్ళీ పెళ్ళిచేసుకోమని పోరుతున్నారు. ఈ పెళ్ళికి నాలుగు మూలల నుంచీ అందరూ చేరుతారుకదా—ఇక నాప్రాణం తినేస్తారు'' అన్నాడు అతను, మధ్య బెర్త్ సెట్ చేయడానికి పాపని భుజాన వేసుకుని లేస్తూ.

సుజాత చొరవగా బాబుని తీసుకుని భుజాన వేసుకుని నిలబడింది.

''మీరు మీకోసం కాకపోయినా పిల్లలకోసమయినా మీ వాళ్ళ మాట వినాలి. పిల్లలు మరీ

చిన్నవాళ్ళు కదా!, అనాలోచితంగా అనేసి చప్పున నాలిక కొరుక్కుంది సుజాత.

"క్షమించండి. మీ సొంత విషయాల్లో కల్పించుకున్నాను."

"ఫరవాలేదు. నాకు మీరు పరాయివాళ్ళలా అనిపించడం లేదు లెండి" అంటూ నవ్వేశాడు అతడు.

సుజాత గుండె వేగంగా కొట్టుకుంది. ఒళ్ళంతా ఏదో మధురమైన జలదరింపు!

"నాకు కావల్సింది నా భార్య కాదు! నా పిల్లలకి తల్లి! నిజంగా నా పిల్లలని స్వంత పిల్లల్లా చూసుకునే అమ్మాయి దొరికితే నాకు కులం పట్టింపు అందం పట్టింపు, డబ్బు పట్టింపు— ఏదీ లేదు! అయితే అలాంటి అమ్మాయి దొరకాలి కదా! నా పిల్లల అదృష్టం ఎలా ఉందో?" అన్నాడు అతను బెర్త్ గొలుసులు సర్దుతూ.

భుజం మీద పాపను మధ్య బెర్త్ మీద పడుకోపెట్టాడు. సుజాత బాబుని క్రింది బెర్త్ మీద పడుకోబెట్టింది.

"మీ రనవసరంగా ఇబ్బంది పడకండి. వసంత పోయాక పిల్లల భవిష్యత్తు తలుచుకుంటూ నెలల తరబడి రాత్రిళ్ళు నిద్రలేకుండా గడిపాను. ఈ రాత్రికి పిల్లలని పడుకోబెట్టి నేను జాగరణ చేయలేకపోను" అన్నాడు అతను.

"నాకేమీ ఇబ్బంది లేదు" అంటూ బాబు పక్కన సర్దుకుని పడుకుంది సుజాత.

"మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నందుకు సారీ! ఆ బుట్ట మీద ఉన్న టవల్ ఇస్తారా, పాపకి కప్పుతాను." అతను చేయి క్రిందకు చాపాడు.

సుజాత టవల్ అందిస్తున్నప్పుడు అతని చేయి తగిలి ఒళ్ళు జల్లుమంది.

"ఆ చేయి ఎంత వెచ్చగా ఉందో! ఆ చేయి తనకి అండగా ఉందంటే జీవితం అంతా నిశ్చింతే!

ఛీ, ఛీ. తను ఎంత సిగ్గులేకుండా ఆలోచిస్తోంది? రైల్లో పరిచయం అయిన పరాయి మగాడి గురించి అలా ఆశలు అల్లుకోవడమేనా?, —తన మీద తనే విసుక్కుంది సుజాత.

కానీ మళ్ళీ మళ్ళీ ఆ ఆలోచన ఆమెని చుట్టుముట్టసాగింది.

అయినా ఇందులో తప్పేం ఉందీ? అతనికి పెళ్ళయి ఇద్దరు పిల్లలు. ఆ పిల్లలకి తల్లి కావాలి అతను అందగాడే కావచ్చు. కానీ అతనికి కావాల్సింది అందమైన మనస్సు ఉన్న అమ్మాయి మాత్రమే! తను ఆ పిల్లల్ని సొంత పిల్లల్లాగా చూసుకోగలదు. అసలు తనకి చిన్నప్పట్నించే పిల్లలంటే ఎంతో ముద్దు. అవసరమైతే ఉద్యోగం వదిలేసుకుని అయినా వాళ్ళ ఆలనా, పాలనా చూసుకుంటుంది.

హర్ష పెళ్ళి వంకన దేవుడు తన కిచ్చిన అవకాశం ఇదేమో! దీన్ని జారవిడుచుకుంటే జీవితంలో మళ్ళీ తనకి కల్యాణ గడియ రాకపోవచ్చు.

రెండో పెళ్ళి వాడైనా తన కేమీ అభ్యంతరం లేదు.

అయితే "నన్ను పెళ్ళి చేసుకుంటారా" అని తనంతట తను ఎలా అడగటం? ప్రాణం చచ్చిపోయి



నట్లు ఉండదూ!

అంతకన్నా అతని అడ్రెస్ రైలు దిగిపోయేటప్పుడు తీసుకుని, తన ఉద్దేశం ఉత్తరం ద్వారా తెలియజేస్తే నయం.

అతను ఆ ఉత్తరాన్ని చించి ముక్కలు చేస్తాడో? భద్రంగా దాచుకుని జవాబు వ్రాస్తాడో! ఇంతకీ తన అదృష్టం ఎలా ఉందో?

తన జీవితంలో ఇదో మలుపు కాబోతోందా?, ఆలోచనల ప్రవాహంలో కొట్టుకుపోతున్న సుజాత బాబు కదలడంతో చప్పున అటు తిరిగింది.

చలికి బాబుని దగ్గరగా పొదువుకుని పడుకోవడంలో ఎనలేని హాయి కనిపించింది సుజాతకి.

ఆమె బాబుని మరింత దగ్గరగా పొదువుకుంటూ 'భగవంతుడా! నా కీ బాబుని ఇంకా దగ్గరచేయి!' అని ప్రార్థించింది మూగగా.

తల్లి "నేనైనా నీ పెళ్ళి చూడగలనో లేదో" అని కళ్ళొత్తుకున్నప్పుడల్లా "నాకేం తక్కువని, అమ్మా, ఆ బాధ?" అని నవ్వుతూ కొట్టిపారేసేది. కానీ ఆ నవ్వులో ఏదో వెలితి! ఆ వెలితి ఇలా భర్తీ కానున్నదా? ఏమో! ! మెమ్మదిగా నిద్రలోకి జారింది సుజాత.

ఆమెకి మెలకువ వచ్చేసరికి తెల్లగా తెల్లవారిపోయింది.

ఎదురుగా ఉన్న బెర్త్ మీద ముసలి దంపతులు గాజు గ్లాసులో కాఫీ కాబోలు చప్పరిస్తూ ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు.

చప్పున లేచి కూర్చుంది సుజాత.

బాబు కదులుతున్నాడు.

"గుడ్‌మార్నింగ్!" అన్నాడు అతను బూట్లు తొడుక్కుంటూ.

"వెరీ గుడ్మార్నింగ్! పాప లేచిందా?" మధ్య బెర్త్ పైకి చూస్తూ అంది సుజాత.

"లేచి పావు గంట అయింది. మొహం కడుక్కోనని పేచీ!" కిటికీ దగ్గిర ఎవరి పక్కనో కూర్చుని కిటికీలోంచి బయటికి చూస్తున్న పాపని చూపిస్తూ అన్నాడు అతను.

"ఇప్పుడే బీబీనగర్ దాటింది. మరో అరగంటలో సికింద్రాబాద్ చేరిపోతాం!" అన్నాడు.

ఎప్పుడూ లేనిది గుమ్మం దగ్గిర పడుతూంటే ఏదోవిధమైన అలజడిగా ఉంది సుజాతకి! అతని పేరు, అడ్రెస్ అడగాలన్నా ఏదో జంకుగా ఉంది. చటుక్కున మెరుపులాంటి ఆలోచన వచ్చింది సుజాతకి. ఆ పాపతో మాటలు కలిపి, యథాలాపంగా అడిగినట్లు అతన్ని గురించి అడిగితే నయమేమో! కొన్నైనా వివరాలు తెలియవచ్చు.

చప్పున లేచి, రా పాపా! ఇద్దరం వెళ్ళి మొహం కడుక్కుందాం పద" అంటూ వింతగా చూస్తున్న పాప చేయి చనువుగా పట్టుకుని బాత్‌రూమ్ వైపు తీసుకెళ్ళింది.

తన సోప్‌తోనే పాప మొహం రుద్దబోతూ, "నీ పేరేంటి, పాపా?" అని అడిగింది.

"నా పేరు శ్వేత. మా తమ్ముడి పేరు కార్తీక్. నా పేరే బాగుంది కదా, ఆంటీ?" అంది పాప చక్రాల్లాంటి కళ్ళు పెద్దవి చేసి.

సుజాతకి నవ్వు వచ్చింది.

"ఫూ! మీ నాన్న పేరేమిటి మరి?" అంది పాప మొహం నీళ్ళతో కడుగుతూ.

"నాన్న పేరా? చైతన్య! అంది పాప కళ్ళు మూసుకుని.

'మనిషి రూపానికి తగ్గ అందమైన పేరు' అనుకుంది సుజాత.

"అయ్యో! ఇదేం కడగడం, ఆంటీ? నా గౌనంతా తడిపేశావు!" తడిసిపోయిన గౌను చూసుకుంటూ నిష్ఠురంగా అంది పాప.

"ఫరవాలేదులే! ఇంకో గౌను వేసుకుందువుగానీ!" అంది సుజాత టవల్‌తో పాప మొహం అద్దుతూ.

"నా గౌన్లన్నీ మా ఇంట్లోనే ఉన్నాయి. ఇక్కడేమీ లేవుగా" అని బిక్కమొహం పెట్టింది పాప.

"మీ డాడీ పెట్టెలో నీ గౌన్లు కూడా సర్ది ఉంటారు లేమ్మా!" నచ్చచెప్పింది సుజాత.

"మా డాడీ మా ఇంట్లో ఉన్నాడు. నా గౌన్లు ఇక్కడి కెవరు తెస్తారు?" బుంగమూతి పెట్టింది పాప.

"ఇప్పుడు నువ్వు, మీ తమ్ముడు వస్తోంది మీ డాడీతో కాదూ?" విభ్రాంతిగా అడిగింది.

"కాదుగా! ఆ అంకుల్ మధ్యాహ్నం నేనూ, తమ్ముడూ చాక్‌లేట్లు కొనుక్కోడానికి ట్రంకు రోడ్డు మీదికి వస్తే ఐస్‌క్రీమ్ కొనిపెట్టాడు. రైలు ఎక్కిస్తానని చెప్పి ఎంచక్కా రైలు కూడా ఎక్కించాడు. సాయంత్రం మళ్ళీ అమ్మ దగ్గరకి తీసుకెళ్ళిపోతాట్ట! ఎంత మంచి అంకులో కదూ!" అంది పాప తడిసిన గౌను చేత్తో తుడుచుకుంటూ.

షాక్ తిన్నట్లుగా నిలబడిపోయింది సుజాత. తను కలలు కన్నది ఒక మోసగాడి గురించా? తనకి కూడా చిన్నగా గేలం విసిరాడు. తను పడి ఉంటే హనీమూన్ పేరుతో ఏ బొంబాయో తీసుకెళ్ళి అమ్మేసి ఉండేవాడు. ఒక్కసారి వణికింది సుజాత.

హర్ష పెళ్ళిపేరుతో భగవంతుడు తన కిచ్చిన అవకాశం — ఒక పిల్లల దొంగని పోలీసులకి పట్టివ్వడమా?

సుజాత కృతనిశ్చయురాలై ముందుకి నడిచింది. అప్పుడే అటుగా వచ్చిన టి. సి. తో ఆమె ఏం మాట్లాడుతోందో అర్థం కాక చూస్తూ ఉండిపోయాడు అతను.

*